బకాయిలు విడుదల చేయండి

- జీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో
- పోలీసులు, నాయకుల మధ్య తోపులాట, అరెస్టులు



అరెస్ట్ చేస్తున్న పోలీసులు



రోడ్డుపై ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులు

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని 18 లక్షల మంది విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ఎర్రం సుధీర్ డిమాండ్ చేశారు. బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆందోళనను విరమించాలని కోరగా, ససేమిరా అనడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఎర్రం సుధీర్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని, యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని తెలిపారు. చాలామంది నిరుపేదలను ఉన్నత విద్యకు దూరం చేస్తూ, వారి జీవితాలను రోడ్డుపాలు చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌కు లిక్కర్ దందాపై ఉన్న ధ్యాస.. విద్యారంగంపై లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలని లేదంటే బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్, అర్బన్ అసెంబ్లీ కన్వీనర్ కల్వే చిరంజీవి, ఐటీ సెల్ కన్వీనర్ విపుల్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిధులు మంజూరు చేయండి



డిచ్‌పల్లి: గ్రామాల అభివృద్ధి కోసం ఉప సర్పంచులకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని డిచ్‌పల్లి మండల ఉప సర్పంచుల ఫోరం ప్రతినిధులు శుక్రవారం ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కోరారు. శుక్రవారం ఉపసర్పంచులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిశారు. నిధులు మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు.

దంత వైద్య పరీక్షలు

ఇందల్వాయి: సిర్నాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శీనునాయక్ దంత వైద్యశాల వైద్యుడు శీనునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి 75 మందికి పరీక్షలు చేసి దంత సంరక్షణకై పలు సూచనలు చేసి టూత్ పేస్ట్‌లు, మందులు అందజేశారు. వైద్య బృందానికి ప్రధాన ఉపాధ్యాయురాలు సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులకు అభినందన



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఈ నెల 21, 22 తేదీలలో నిర్వహించనున్న తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌కు ఎంపికై న జిల్లా క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా చైర్మన్ బస్వా లక్ష్మీనర్సయ్య అభినందించారు. శుక్రవారం నగరంలోని బస్వాగార్డెన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ విభాగాల్లో జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాస్టర్ మనోజ్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంస్మరణ సభను విజయవంతం చేయాలి




నిజామాబాద్‌నాగారం: దళిత రత్న అవార్డు గ్రహీత సక్కి గంగాధర్ సంస్మరణ సభను ఈ నెల 22న న్యూ అంబేడ్కర్ భవనంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా నాయకులు బంగారు సాయిలు కోరారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. జిల్లాలో ఉన్న మాలలు అందరు తరలిరావాలన్నారు. నేతలు ఎడ్ల రాము, పులి జైపాల్, రాజేందర్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): ఈ నెల 22న జరగనున్న పౌరహక్కుల సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా 16వ మహాసభను విజయవంతం చేయాలని సంఘం ప్రధాన కార్యదర్శి అల్గోట్ రవీందర్ పిలుపునిచ్చారు. తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ఎదుట శుక్రవారం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుందన్నారు. మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. తెయూ ప్రొఫెసర్ కనకయ్య, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దత్తహరి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేందర్, కర్క గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి తరలిరండి



నిజామాబాద్‌నాగారం: జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23న జరిగే వీర బ్రహ్మేంద్రస్వామి- మాతగోవిందమాంబ కల్యాణానికి విశ్వబ్రాహ్మణులందరూ తరలిరావాలని జిల్లా అధ్యక్షులు సత్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. అలాగే జిల్లా నూతన కమిటీ ప్రమాణస్వీకారం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ మధుసూదనచారి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, కోశాధికారి లక్ష్మణచారి పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

నగర మేయర్ దండు నీతూకిరణ్



కుర్చీలు, టేబుళ్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: మహిళలు ఇన్నర్ వీల్ క్లబ్‌ను ఏర్పాటు చేసుకుని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమని నగర మేయర్ దండు నీతూ కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్ ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో నాగారం 300 క్వార్టర్స్‌లోని జీపీఎస్ జెండా గల్లీ పాఠశాలకు కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు మేయర్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని కోరారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సాక్షి మాట్లాడుతూ.. ఇకముందు కూడా పాఠశాలకు తమ వంతు సహకారం అందిస్తామని తాము ఇచ్చిన వస్తువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లబ్ సభ్యులు రజిని, సంధ్య, స్వప్న, ప్రధానోపాధ్యాయులు రామచందర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న దండి వెంకట్

ఖలీల్‌వాడి: రాష్ట్ర వ్యాప్తంగా దళిత బహుజన ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం సుభాష్ నగర్‌లో గల బీఎల్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో వెంకట్ మాట్లాడారు. బహుజన వర్గాల సమస్యలు పరిష్కారం కావాలంటే తెలంగాణ సమాజంలో 93 శాతం ఉన్న బహుజన వర్గాలు రాజ్యాధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందన్నారు. 25న హైదరాబాద్‌లో జరిగే సభకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్లు కాశిం, ప్రభంజన్ యాదవ్‌లు హాజరవుతారని తెలిపారు. రాబోయే రోజుల్లో బీఎల్‌ఎఫ్‌ను బలోపేతం చేయడానికి ఆవిర్భావ సభలో తీర్మానాలు చేస్తామని తెలిపారు.

ఉపాధి కల్పనకు కేంద్రం కృషి

- నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్స్ మిషన్ ఆఫీసర్ గంగప్ప



జ్యోతి వెలిగించి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న ఆఫీసర్ గంగప్ప

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఉపాధి కల్పనకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్స్ మిషన్ ఆఫీసర్ గంగప్ప తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీ)ను ఆయన సందర్శించారు. జ్యోతి వెలిగించి టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. జాతీయ ఉపాధి కల్పనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం అమలు, పనితీరును పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళా అభ్యర్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంస్థ ఆవరణలో ఒక మొక్క నాటి నీళ్లు పోశారు. సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు



మల్కాపూర్(ఎం)లో కంటి పరీక్షలు

సిరికొండ/నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి :నిజామాబాద్ రూరల్, అర్బన్ పరిధిలో రెండో రోజు శుక్రవారం కంటి పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్య సేవాలు అందించారు. అవసరమైన వారికి కేవలం దగ్గరి చూపు (రీడింగ్) అద్దాలు అందజేశారు. మోతిబిందు, ఇతర సమస్యలున్న వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలో ప్రతి నెలా మూడో శనివారం సబ్ స్టేషన్లలో నెలవారి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టౌన్ ఏడీఈలు చంద్రశేఖర్, తోటరాజశేఖర్, వీరేశంలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. నగరంలోని తిలక్ గార్డెన్, న్యూహౌసింగ్ బోర్డ్, వినాయక్ నగర్, సుభాష్ నగర్, గూపన్‌పల్లి, అర్సపల్లి ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు.

డిచ్‌పల్లి పరిధిలో..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి డివిజన్ పరిధిలో శనివారం 33/11 కేవీ విద్యుత్ కేంద్రం, 15 ఉప విద్యుత్ కేంద్రాలలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ శ్రీనివాస్, ఏఈ సాయిలు శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తారని తెలిపారు. డిచ్‌పల్లి, కమలాపూర్, మిట్టాపల్లి, రాంపూర్, దూస్‌గాం, దమ్మన్నపేట్, మైలారం, రామడుగు, గన్నారం, ఇందల్వాయి, మిషన్ భగీరథ, ఎల్లారెడ్డిపల్లి, అన్సాన్‌పల్లి, సిర్నాపల్లి, గౌరారం సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంట్ ఉండదన్నారు.

మహిళా సాధికారత సదస్సు

ఖలీల్‌వాడి: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో మహిళ సాధికారత అనే అంశంపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహిస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ, ప్రవేట్ రంగాలకు చెందిన వారు, సామాజిక రంగంలో పని చేస్తున్న మహిళలు, విద్యార్థినులు, యువతులు హాజరు కానున్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ, ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, పోలీస్‌కమిషనర్ కేఆర్ నాగరాజు, తదితరులు హాజరుకానున్నారు.

ఆర్టీసీ కార్గో సిబ్బంది అవగాహన ర్యాలీ

ఖలీల్‌వాడి: ఆర్టీసీ కార్గో సిబ్బంది, ఏజెంట్లతో నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్, నెహ్రూపార్క్, తదితర ప్రాంతాలలో వ్యాపారులకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ ఆర్టీసీ కార్గో ఇన్‌ఛార్జి శంకర్ తెలిపారు. వ్యాపారులు ఆర్టీసీ కార్గోలో వస్తువులు,సామాన్లను ఒక చోటు నుంచి ఇంకో చోటుకు పంపించడానికి అవకాశం ఉంటుందన్నారు.

రేపు బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో టీబీఎస్ఎస్(తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం), ఐబీఎస్ఎస్(ఇందూర్ బ్రాహ్మణ సేవా సంఘం) సంయుక్త ఆధ్వర్యంలో 19వ బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు శుక్రవారం సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పరిచయ వేదిక జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 7981567983 నంబరుకు కాల్ చేయాలని కోరారు.

ఫిబ్రవరి 5న సీనియర్ సిటిజన్స్ ఫోరం ఎన్నికలు

నిజామాబాద్‌నాగారం: సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా ఎన్నికలు ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఆశయ్య శుక్రవారం తెలిపారు. నోటిఫికేషన్‌ను జారీ చేశారు. 3 ఏళ్ల కాలపరిమితికి గాను ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

'అలా చేస్తే అత్యాచారాలు జరగవు'



డిచ్‌పల్లి: ఆడపిల్లను చూడగానే మాతృత్వం గుర్తుకు వస్తే హత్యాచారాలు ఉండవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరిత, బుజ్జి అన్నారు. శుక్రవారం ఘన్‌పూర్, లింగసముద్రం గ్రామాల్లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా 'బేటీ బచావో.. బేటీ పఢావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఆడపిల్ల అంటే సృష్టికి మూలమని, వారిని చదవనిద్దాం, ఎదగనిద్దాం,బతకనిద్దామని నినాదాలు చేశారు. అనంతరం సూపర్‌వైజర్లు సరిత,బుజ్జిలు మాట్లాడుతూ..ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ మారు దాం, ఆడపిల్లలను కాపాడుకుందామని పిలుపునిచ్చా రు. లింగవివక్షత, వ్యక్తిగత పరిశుభ్రత, అమ్మాయి లు తనను తాను ఎలా రక్షించుకోవాలి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ధర్మపురిహిల్స్‌లో శ్మశానాల భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని 6వ టౌన్ ఎస్సై సాయి కుమార్ గౌడ్‌కు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ, ఇమామ్, హైమద్‌రజా గ్రేవ్ కమిటీల ఆధ్వర్యంలో విన్నవించారు. అక్రమంగా భూమిని కబ్జా చేయడమే కాకుండా దాడులు చేయడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. అమాయక ప్రజలపైన స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతాపం చూపుతున్నారన్నారు. నాయకులు సయ్యద్ కైసర్, కమిటీ అధ్యక్షులు ఎండీ బషీర్, ప్రధాన కార్యదర్శి ఖాజా ఎత్తేసామోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు తగ్గించాలని నిరసన



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ చార్జీల పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ భవన్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ ప్రతినిధి ఓమయ్య మాట్లాడుతూ.. ఏసీడీ బిల్లుల వసూలు చేయవద్దన్నారు. వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

బూత్ కమిటీల నియామకం



ధర్పల్లి: రామడుగులో శుక్రవారం బీఆర్ఎస్ బూత్ కమిటీలను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సూచన మేరకు బూత్ కమిటీలను నియమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ నవీన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ధరావత్ గోపాల్, నాయకులు దాసు, రమేష్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ధర్పల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం తహసీల్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దా ర్ గంగాసాగర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. గత సంవత్సరం సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2 వేలు జీతం పెంచినట్లు ప్రకటించినప్పటికీ, జీవోను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను వెంటనే గుర్తించి ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమాలను అమలు చేయాలని కోరారు. ఉచిత గ్యాస్ సప్లైతో పాటు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు సునీత, రాజమణి, శారద, లత తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలతో విభజిస్తున్న కేంద్రం

- అభివృద్ధి కంటే అధికారాన్నే ఇష్టపడుతోంది
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్



హందాన్

నిజామాబాద్ సిటీ: ప్రజలను మత విద్వేషాలతో విభజించి అధికారం చేజిక్కించుకోవడంలో బీజేపీ చురుగ్గా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తాహెర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో 9 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశమంతటా మత విద్వేషాలు, ప్రజావ్యతిరేక విధానాలను వ్యాప్తి చేస్తూ దేశ అభివృద్ధి, శ్రేయస్సును మరచిపోయారని విమర్శించారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ద్వేషం, మతపరమైన ఉద్రిక్తతలు పెరిగాయన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల దేశవ్యాప్తంగా మైనారిటీలు, రైతుల ప్రగతి కుంటుపడిందన్నారు. ఈ వర్గాలు అభివృద్ధి చెందనంత వరకు దేశాన్ని అభివృద్ధి చేయడం సాధ్యం కాదన్నారు. మోదీ నేతృత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశానికి చేసిందేమీ లేదని, చేసిన తప్పులకు పశ్చాత్తాపం కూడా వారికి లేదన్నారు. ఇలాంటి నియంతకు త్వరలో ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు.

పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు భూమయ్య

ఖలీల్‌వాడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతులకు మద్దతు ధర కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య కోరారు. శుక్రవారం సంఘం నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అర్సపల్లిలో సమావేశం నిర్వహించారు. భూమయ్య మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వాలు పసుపు రైతులకు ఇచ్చిన హామీని విస్మరించాయని, దీని మూలంగా పసుపు మార్కెట్లో ట్రేడర్లు రూ. 5,000 మించి కొనడం లేదన్నారు. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు నష్టాల్లో కూరుకపోతున్నారన్నారు. 2018లో మద్దతు ధర కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. పసుపును మార్కెఫెడ్ ద్వారా క్వింటాకు రూ.15 వేలకు కొనుగోలు చేయాలని, పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నేతలు నాయక్‌వాడి నరసయ్య, గోపాల్, సాయిలు పాల్గొన్నారు.

'ఈటల ఎదుగుదల చూసి ఓర్వలేకపోతున్నారు'



మాట్లాడుతున్న నర్సింగ్ ముదిరాజ్

నిజామాబాద్‌నాగారం: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే కించపరుస్తూ కేసీఆర్ ప్రచారం చేస్తున్నారని నిజామాబాద్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు యాసాడ నర్సింగ్ ముదిరాజ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని సంఘం ఆవరణలో ఆయన మాట్లాడారు. బీజేపీలో రాజేందర్ కష్టపడి పార్టీ ఎదుగుదల కోసం కృషి చేస్తున్నారన్నారు. ఆదరణను చూసి ఓర్వలేక ఆయనపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా కేసీఆర్ ఇలాంటి చిల్లర ప్రయత్నాలు మానుకోవాలని లేదంటే ముదిరాజ్‌ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సంఘం నేతలు సత్యనారాయణ,గంగాధర్, బీజేపీ నేత ఆంజనేయ రెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

హాకీ జిల్లా జట్టు శిక్షణ పూర్తి



శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులు

సిరికొండ: రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే నిజామాబాద్ జిల్లా జట్టు శిక్షణ శిబిరం పూర్తయినట్లు పీఈటీ నాగేష్ శుక్రవారం తెలిపారు. సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టుకు తూంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ శిబిరం నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. జిల్లా జట్టుకు ప్రస్తుత పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు క్రీడా దుస్తులను వితరణ చేశారన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

నిజామాబాద్ సిటీ: నగరంలోని ఆనంద్‌నగర్(రేడియాస్టేషన్ వెనుకాల) శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఆలయానికి కాలనీవాసులతో పాటు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయం కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం ఓ భక్తుడు ఆలయానికి 25 ప్లేట్లను విరాళంగా ఇచ్చారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, స్థానిక కార్పొరేటర్ పట్నం విక్రమ్‌గౌడ్, అధ్యక్షుడు మారుపాక కిషన్, ఉపాధ్యక్షుడు వెంకట్ రాములు, 11వ డివిజన్ కార్పొరేటర్ సాయివర్ధన్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,050	వెండి (కిలో)	71,000
22 క్యారెట్స్	53,510		- నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	క్యాప్సికం	30	50
బెండకాయ	70	90	గాజరుగడ్డ	25	40
జీరకాయ	50	70	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	35	50	దోసకాయ	30	50
జిర్నిసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	40	60	గోబిపువ్వు	20	30
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	45	60
పుదీనా	40	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్-1- వీరసింహారెడ్డి- 1.20,4.25,7.30 10.40
స్క్రీన్-2-వారసుడు- 1.10,7.30,10.40
స్క్రీన్-3- వాల్తేరు వీరయ్య -10.30,1.30 4.30,7.30,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1-వాల్తేరు వీరయ్య -9.30,12.50,4.10 7.30,10.50
స్క్రీన్-2-వాల్తేరు వీరయ్య-11.10,9.30
వారసుడు-2.30,6.00
స్క్రీన్-3-వారసుడు-11.40
వీరసింహారెడ్డి -3.10,6.40,10.10
స్క్రీన్-4- వీరసింహారెడ్డి -11.10
పుష్ ఇన్‌బో(ఇంగ్లీష్) 2డీ-2.40,8.25
వాల్తేరు వీరయ్య-5.05
వారసుడు -10.50

దేవి	వీరసింహారెడ్డి
నటరాజ్	ధమాకా
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	ధమాకా
విజయ్	వారసుడు